RNI NO: APTEL/26/A3560

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 102 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. పేజీలు : 4 వెల రూ.2 ఆదివారం -23 - ఆగష్టు - 2026

Published From :Kurnool circulated by YSR Kadapa I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

## రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై.. ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు!




- లాంచ్ వెహికల్స్ తయారీ నుంచి క్రమంగా తప్పుకోనున్న ఇస్రో
- ప్రైవేట్ రంగానికి రాకెట్ల తయారీ, ఉత్పత్తి బాధ్యతలు
- ఎస్ఎస్ఎల్వీ టెక్నాలజీ, ఉత్పత్తి హక్కులు ఇప్పటికే హెచ్ఏఎల్‌కు బదిలీ
- తదుపరి దశలో పీఎస్ఎల్వీ, ఎల్వీఎం3 తయారీ
- ఇకపై ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికతలపై దృష్టి

## షెహబాజ్‌కు ముప్పేట ముప్పు.. పాక్ రాజకీయాల్లో కొత్త సమరం!

షెహబాజ్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పి




- పీపీపీ ప్రభుత్వ బిల్లులకు మద్దతు నిలిపివేస్తామని హెచ్చరిక
- పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎన్నికలపై పీపీపీ న్యాయపోరాటానికి సిద్ధం
- కొత్త రాష్ట్రాల అంశంపైనా మిత్రపక్షాల మధ్య విభేదాలు




## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

- శక్తిమంతంగా, గౌరవంగా ఉన్నప్పుడే ముగించడం మేలని వ్యాఖ్య
- అమెరికాను ప్రపంచమంతా ద్వేషిస్తోందన్న పెజెష్కియాన్
- కొనసాగుతున్న ప్రతిష్ఠంభన.. మధ్యవర్తిత్వం చేస్తున్న ఒమన్

# నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

### మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సిద్ధం

- ★ వెలిగొండపై సీఎం చంద్రబాబు
- ★ ఆగస్టు 31న ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు సీఎం వెల్లడి
- ★ కూటమి ప్రభుత్వం 48 రోజుల్లో నిర్వాసితులకు రూ.768 కోట్ల పరిహారం చెల్లింపు
- ★ గత ప్రభుత్వ నిర్వాకం వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని సీఎం చంద్రబాబు విమర్శ
- ★ ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితుల హర్షం



అమరావతి: మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఆగస్టు 31వ తేదీన ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత పరిహారంగా మిగతా 2 లో




## మాకు అంతకంటే ఎక్కువ టైమ్ ఇవ్వరు.. క్రికెట్ పై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- కుమారుడు దేవాన్ష్‌తో ప్రతి ఆదివారం క్రికెట్ ఆడతానన్న మంత్రి లోకేశ్
- విశాఖ చంద్రంపాలెం స్కూల్లో రూ. 6.48 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం
- కొత్తగా నిర్మించిన క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టుల ప్రారంభోత్సవం
- విద్యార్థులతో కలిసి సరదాగా వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఆడిన మంత్రి

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని విద్యార్థులతో




## గొడ్డలి పార్టీ పాలనలో నకిలీ మద్యంతో 30 వేల మంది చనిపోయారు

- మెగా డీఎస్సీపై విమర్శలను తిప్పికొట్టిన సీఎం చంద్రబాబు
- రాజకీయ చెత్తను కూడా శుభ్రం చేయాలి
- ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుస్తాం
- ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తీసుకురాకపోతే అది ఎవరితప్పు?: సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో గ్రూప్ 1 పేపర్లు ప్లంబర్లతో దిద్దించారని ఆరోపణ

# 14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

### స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన ప్రత్యేక దృష్టి

- ▶▶ మంత్రులు, ఎంపీలతో జనసేన కమిటీ.. స్థానిక ఎన్నికలే లక్ష్యం
- ▶▶ ఎన్నికల వ్యూహాలు, మార్గదర్శకాల రూపకల్పన బాధ్యత
- ▶▶ కమిటీలో మంత్రి దుర్గేష్, ఎంపీ బాలశౌరికి చోటు



అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, మిగతా 2 లో

# ఎవరినీ వదిలిపెట్టేది లేదు

### అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని కూల్చేస్తాం

- ఇక ఎవరిని ఉపేక్షించం. ఈ భవనాలన్నీ నాలాల పక్కన ఉన్నాయి
- 50 గజాల్లోనే ఏడేసి అంతస్తులు కట్టారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలన్నీ కూలుస్తాం
- ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తులు బిల్డింగ్ నిర్మాణం



హైదరాబాద్: ఎవరినీ వదిలిపెట్టేది లేదని.. అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని కూల్చేస్తామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మిగతా 2 లో




## హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం కృషి

- యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలి
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలి
- తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు

# ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

### కేంబ్రిడ్జ్ ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలి

- ➤ కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు గారు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం
- ➤ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి
- ➤ హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి ఇది మరింత బలం




హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఈ బృందం తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించింది. సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మిగతా 2 లో




## జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్? కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

- ▶▶ రేవంత్ రెడ్డి అమెరికా టూర్‌కు కేంద్ర అనుమతి నిరాకరణ
- ▶▶ జేడీ వాన్స్, మమ్దానీలతో సమావేశానికి రేవంత్ ప్లాన్ చేసినట్లు సమాచారం
- ▶▶ ఆ విషయాన్ని విదేశాంగ శాఖకు వెల్లడించలేదని సమాచారం
- ▶▶ అందుకే అనుమతి నిరాకరించినట్లు ఎన్‌డీటీవీ కథనం

RNI : APTEL/25/A0188 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం విద్యావేత్తల బృందంతో ఫలప్రదమైన సమావేశం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఈ బృందం తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించింది. సమావేశంలో ముఖ్యమంత్రి తో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు , ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ప్రపంచ అత్యుత్తమ విద్యా సంస్థలకు ఉన్న అవకాశాలను వివరించి, ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని కేంబ్రిడ్జ్ ప్రతినిధులను ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు గారు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అవకాశాలపై సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తల ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకారంపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి. కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గం చూపనున్నాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి ఇది మరింత బలం చేకూర్చనుంది.

# జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్? కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీలతో భేటీ కూడా ఆయన పర్యటనలో భాగంగా ఉండటమే ఇందుకు కారణంగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు ఎన్డీటీవీ పేర్కొంది. అమెరికా, బ్రిటన్ పర్యటనలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కోరింది. బ్రిటన్ పర్యటనకు అంగీకరించిన కేంద్రం అమెరికా టూర్‌కు మాత్రం అనుమతి నిరాకరించింది. అమెరికా పర్యటనలో జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీలను ప్రతిపాదించినప్పటికీ.. ఈ కార్యక్రమాలను విదేశాంగ శాఖతో చర్చించలేదని, రాజకీయ అనుమతి ప్రక్రియలో భాగంగా సమాచారం పంపలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చే ముందు ముఖ్యమంత్రి వంటి ప్రజాప్రతినిధుల ప్రతిపాదిత కార్యక్రమాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుంది. పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమాలు ఉన్నాయా? అన్నది పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తుంది. ఈ అంశంపై శుక్రవారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. రేవంత్‌రెడ్డి బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని, అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలు కొన్ని ప్రమాణాలకు తగినవిగా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలు సరిపోలకపోవడంతో అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్య భారీగా ఉండటంతో రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాలోని భారతీయ అమెరికన్లలో తెలుగు సమాజం సుమారు 14 శాతం ఉంటుందని, 12 లక్షలకు పైగా తెలుగు ప్రజలు అక్కడ ఉన్నారని సమాచారం. అయితే ఈ వ్యవహారం తెలంగాణలో రాజకీయ వివాదానికి దారితీసింది. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించి, బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వడంపై ప్రశ్నలు తలెత్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ నిర్ణయం రాజకీయ కక్షతో తీసుకున్నది కాదని, కేవలం సాంకేతిక అంశాల ఆధారంగానే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినట్లు చెబుతున్నాయి.

## మాకు అంతకంటే ఎక్కువ టైమ్ ఇవ్వరు..

# క్రికెట్ పై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు

అమరావతి: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. తనకు క్రికెట్ అంటే చాలా ఇష్టమని, ప్రతి ఆదివారం తన కుమారుడు దేవాన్ష్‌తో కలిసి రెండు, మూడు గంటల పాటు తప్పనిసరిగా క్రికెట్ ఆడతానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు అంతకంటే ఎక్కువ సమయం ఇవ్వరంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు విరిసాయి. విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ తన క్రికెట్ ఇష్టాన్ని బయటపెట్టారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో రూ. 6.48 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన పునర్‌నిర్మాణ, అభివృద్ధి పనులను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తగా నిర్మించిన క్రికెట్ గ్రౌండ్, వాలీబాల్ కోర్ట్, బాస్కెట్‌బాల్ కోర్ట్, వాకింగ్ ట్రాక్‌తో పాటు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కూడా ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవాల అనంతరం మంత్రి లోకేశ్ విద్యార్థులతో కలిసిపోయారు. వారితో కలిసి సరదాగా వాలీబాల్, బాస్కెట్‌బాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. ఈ పాఠశాలకు రావడం ఇది మూడోసారని, వచ్చిన ప్రతిసారీ భారీ వర్షం కురుస్తుందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఈ స్కూల్ పేరు వింటేనే నాకు వాన గుర్తొస్తుంది. నా నియోజకవర్గం మంగళగిరిలోని స్కూల్‌కు కూడా నేను మూడుసార్లు వెళ్లలేదు" అని ఆయన అనడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి రాక సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

# షెహబాజ్‌కు ముప్పేట ముప్పు.. పాక్ రాజకీయాల్లో కొత్త సమరం!

ఢిల్లీ: పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. కీలక మిత్రపక్షమైన 'పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ' (పీపీపీ)తో విభేదాలు ముదురుతుండగా, ప్రతిపక్షాలు ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్నాయి. మరోవైపు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వైద్య చికిత్స వ్యవహారం కూడా ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెడుతోంది. ఆగస్టు 18న ఇమ్రాన్‌ను అడియాలా జైలు నుంచి రెండు రోజుల్లో ఇస్లామాబాద్‌లోని షిఫా ఇంటర్నేషనల్ ఆసుపత్రికి తరలించాలని పాక్ సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఈ ఉత్తర్వులపై పునర్విచారణ కోరింది. భద్రతా కారణాలతో షిఫాకు బదులుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని పిమ్స్ ఆసుపత్రికి తరలించింది. వైద్య పరీక్షల తర్వాత కొన్ని గంటల్లోనే మళ్లీ జైలుకు పంపింది. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పాటించలేదంటూ ఇమ్రాన్ కుటుంబం, పీటీఐ ఆరోపించాయి. ఈ వ్యవహారం కోర్టు ధిక్కార కేసుకు దారితీసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో పీపీపీ అధినేత బిలావల్ భుట్టో జర్దారీ ప్రభుత్వం తీరుపై కఠిన వైఖరి తీసుకున్నారు. తమ అభ్యంతరాలు పరిష్కరించే వరకు సెనేట్, జాతీయ అసెంబ్లీలో ప్రభుత్వ బిల్లులకు మద్దతు ఇవ్వబోమని ప్రకటించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించిన పీపీపీ.. ఫలితాలను న్యాయస్థానంలో సవాల్ చేయాలని నిర్ణయించింది. కొత్త రాష్ట్రాల ఏర్పాటుపైనా విభేదాలు తలెత్తాయి. విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం లేకుండా ప్రభుత్వం ముందుకు సాగొద్దని బిలావల్ స్పష్టం చేశారు. మరోవైపు ప్రతిపక్షాలు కూడా ఐక్యంగా కదులుతున్నాయి. జేయూఐ-ఎఫ్ అధినేత మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ నేతృత్వంలో ఉమ్మడి పార్లమెంటరీ వ్యూహంపై చర్చలు సాగుతున్నాయి. సోమవారం కీలక ప్రతిపక్ష సమావేశం జరగనుంది. పీపీపీ మద్దతు దొరికితే షెహబాజ్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం దిశగా పరిణామాలు వేగంగా మారే అవకాశముంది.

# రాకెట్ల తయారీకి ఇస్రో గుడ్‌బై.. ప్రైవేట్ రంగానికి కీలక బాధ్యతలు!

ఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై లాంచ్ వెహికల్స్ తయారీ, సాధారణ శాటిలైట్ల తయారీ వంటి కార్యకలాపాల నుంచి ఇస్రో క్రమంగా తప్పుకోనుంది. ఈ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించనుంది. ఇస్రో పరిశోధన, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి, శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యేక మిషన్లపై మరింత దృష్టి పెట్టనుంది. బిజినెస్ టుడే నిర్వహించిన ఇండియా ఏ 100 ఎకానమీ సమ్మిట్‌లో ఇన్‌స్పేస్ చైర్మన్ డాక్టర్ పవన్ గోయెంకా ఈ విషయాన్ని వెల్లడించారు. "ఇస్రో ఇకపై ఎలాంటి లాంచ్ వెహికల్స్‌ను తయారు చేయదు. వాటి తయారీని ప్రైవేట్ రంగం లేదా ప్రభుత్వ రంగ సంస్థలు చేపడతాయి" అని ఆయన తెలిపారు. ఈ మార్పు ఇప్పటికే ప్రారంభమైంది. చిన్న ఉపగ్రహాలను ప్రయోగించే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) సాంకేతికత, ఉత్పత్తి హక్కులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు బదిలీ చేశారు. తదుపరి దశలో భారత్ ప్రధాన రాకెట్లైన పీఎస్ఎల్వీ (పీఎస్ఎల్వీ), ఎల్వీఎం-3 (ఎల్వీఎం3) సాంకేతికత, తయారీ కూడా ప్రైవేట్ రంగానికి బదిలీ చేసే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే ఈసారి ప్రభుత్వ రంగ సంస్థలకు బదులుగా ప్రైవేట్ పరిశ్రమలకే అవకాశం కల్పించనున్నట్లు గోయెంకా తెలిపారు. ఇకపై ఇస్రో ఒక తయారీ సంస్థగా కాకుండా ప్రధానంగా పరిశోధన, అభివృద్ధి సంస్థగా పనిచేయనుంది. కొత్త సాంకేతికతలు, శాస్త్రీయ మిషన్లు, ప్రత్యేక ఉపగ్రహాలు, అధునాతన అంతరిక్ష మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. ఒక సాంకేతికత అభివృద్ధి చెంది వాణిజ్యపరంగా వినియోగించేందుకు సిద్ధమైన తర్వాత దానిని ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తామని గోయెంకా చెప్పారు. ఇప్పటివరకు ఇస్రోకు చెందిన 120 సాంకేతికతలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త లాంచ్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఆపరేటర్‌ను వచ్చే నాలుగు లేదా ఐదు నెలల్లో ఖరారు చేసే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను ప్రస్తుతం ఉన్న సుమారు 8 బిలియన్ డాలర్ల నుంచి 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే ప్రభుత్వ డిమాండ్, అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాల్లో విస్తృతంగా వినియోగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో భారత సంస్థల విస్తరణ కీలకమని గోయెంకా చెప్పారు. ప్రభుత్వం ప్రధాన కస్టమర్‌గా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ ఇప్పటికే ప్రైవేట్ సంస్థలకు 31 ఉపగ్రహాల తయారీకి ఆర్డర్ ఇచ్చిందని, ఇదే విస్తృత కార్యక్రమంలో భాగంగా మరో 21 ఉపగ్రహాలను ఇస్రో తయారు చేయనుందని తెలిపారు.

# నేను శంకుస్థాపన చేశా.. నేనే ప్రారంభిస్తున్నా

మొదటి పేజీ తరువాయి

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మూడో విడత పరిహారంగా రూ.250 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టం చేశారు.

48 రోజుల్లోనే రూ.768 కోట్ల పరిహారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 48 రోజుల్లోనే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. మూడు విడతల్లో మొత్తం 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తొలి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లు అందించగా, శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు సీఎం చేతుల మీదుగా అందజేశారు. నిర్వాసితులకు ఇంకా రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తయితే 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, సుమారు 4 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

### గత ప్రభుత్వ డ్రామాలతోనే ఆలస్యం: సీఎం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "1996లో నేనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేశాను. ఇప్పుడు 2026లో నా చేతుల మీదుగానే ప్రారంభించడం నా అదృష్టం. గత రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసి మొదటి దశ పనులు పూర్తి చేశాం" అని తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్నా, శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీరు రాకపోయినా, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. "వాస్తవానికి ఈ ప్రాజెక్టు 2021లోనే పూర్తి కావాల్సింది. కానీ గత పాలకుల డ్రామాల వల్ల ఆలస్యమైంది. వారు రాష్ట్రాన్ని ఆర్థికంగా చిదిమేశారు. అయినా 'సూపర్ సిక్స్' వంటి పథకాలను అమలు చేస్తూనే, ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం" అని విమర్శించారు. గంగా-గోదావరి-కావేరి నదుల అనుసంధానం ద్వారా దేశంలో నీటి భద్రత సాధించవచ్చని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు గుర్తుచేశారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి నీరు అందిస్తామని, సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు తమ ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

### పరిహారంపై నిర్వాసితుల హర్షం

ప్రభుత్వం అందించిన పరిహారంపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమను ఇబ్బందులు పెట్టిందని, కూటమి ప్రభుత్వం ఆదుకుందని రైతు కాశిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ప్రారంభించడం సంతోషంగా ఉందని మరో నిర్వాసితుడు బోగెం శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం తమకు పూర్తి పరిహారం అందించి, కాలనీల్లో మంచి వసతులు కల్పించిందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం కృషి

హైదరాబాద్: తెలంగాణలో విద్యా కార్యక్రమాలు పెద్ద ఎత్తున విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం పలికారు. ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంలో 900 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణతో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ భాగస్వామ్య అవకాశాలు, రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' విజన్‌ను వారికి సమగ్రంగా వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తమ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృతమైన విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి గారు ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తెలంగాణ యువతకు, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కీలక సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రెజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న పలు అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. అనంతరం ముఖ్యమంత్రి గారు చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ గారి చిత్రపటాన్ని తిలకించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్‌విల్ కాలేజీకి బహూకరించిన విషయం తెలిసిందే. అనంతరం ముఖ్యమంత్రి, అక్కడే జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంధి గారితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. ఈ ప్రాంగణంలో గోల్ఫ్ కోర్సుతో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, హోటల్ ఉన్నాయి. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి గారు జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ గ్లోబల్ స్పోర్ట్స్ యూనిట్‌తో మంతనాలు జరిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. ప్రస్తుత ప్రీమియర్ లీగ్ ఛాంపియన్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే ఈపీఎల్ మ్యాచ్ వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు.

# గొడ్డలి పార్టీ పాలనలో నకిలీ మద్యంతో 30 వేల మంది చనిపోయారు

అమరావతి: మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు బురద జల్లే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 సర్వీస్ పరీక్షల మూల్యాంకనంలో భారీ అవకతవకలు జరిగాయని, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇంట్లో పనిచేసేవారితో సమాధాన పత్రాలు దిద్దించిన వాస్తవాలు వెలుగు చూస్తుండటంతో, ఇప్పుడు డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలమండ కోడూరులో జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 300 పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ ఎదుర్కొని ఉద్యోగాలు ఇస్తుంటే, ఏడాది తర్వాత ఆరోపణలు చేస్తున్నారు. ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తేకపోతే అదెవరి తప్పు? క్రీడా కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచి ఉద్యోగాలిస్తే, ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారమే క్రీడాకారులకు ప్రాధాన్యం ఇచ్చాం. ఎవరో ఎక్కడో డబ్బులు అడిగారని మొత్తం డీఎస్సీకి అంటగట్టడం దుర్మార్గం. గొడ్డలి పార్టీ అధినేత పీఏ వందల కోట్లు సంపాదించారు, దాని గురించి ఎవరూ మాట్లాడరేం?" అని నిలదీశారు. తప్పు చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఐదేళ్ల పాటు గొడ్డలి పార్టీ విధ్వంసాలు, నేరాలు, ఘోరాలనే నమ్ముకుంది. వారి హయాంలో సరఫరా చేసిన నకిలీ మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది అనారోగ్యంతో చనిపోయారు. కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి, తమకు నచ్చని వారి భూములను 22ఏ జాబితాలో పెట్టారు. ఆ దుర్మార్గాలను సరిదిద్దడానికే మాకు మూడేళ్ల సమయం పడుతోంది. ఇప్పుడు మేం ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి-మీ హక్కు' పేరుతో రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచారు" అని చంద్రబాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రెండింతల సంక్షేమం అందిస్తూనే అభివృద్ధి పనులు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "గత పాలకులు సంక్షేమం ఇస్తున్నామని చెప్పి రోడ్లు కూడా వేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక రోడ్ల రూపురేఖలు మార్చాం. ప్రజలు ఈ చెత్తతో పాటు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలదే. అప్పుడే రాజకీయ నేతలూ తప్పులు చేయరు" అని పిలుపునిచ్చారు. 'దీపం 2.0' ద్వారా నాలుగు నెలలకు ఒకసారి మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను ఆడబిడ్డల ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో ఇప్పుడు ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు విద్యార్థులు వస్తున్నారని, ప్రపంచాన్ని జయించే విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి మన ఉపాధ్యాయులకు ఉందని అన్నారు. ప్రతి గ్రామం 'జీరో వేస్ట్' గ్రామంగా మారాలని ఆకాంక్షించారు. "రెండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశాం. చెత్త నుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నాం. స్వచ్ఛ రథాల ద్వారా చెత్త సేకరించి, నిత్యావసర సరుకులు అందిస్తున్నాం. 'స్వయం' పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం" అని వివరించారు. ఈ సందర్భంగా పలు హామీలు ఇచ్చారు. 30 ఏళ్ల క్రితం ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ప్రారంభిస్తున్నామన్నారు. వచ్చే నెలలోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరందిస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని, 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ నిర్మిస్తామని చెప్పారు. స్థానిక యువతకు స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్యాలు అందిస్తామన్నారు. రూ.29 కోట్లతో ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులు, రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు మంచి చెడులను విశ్లేషించి, మంచి ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు.

## యుద్ధానికి ముగింపు పలుకుదాం..

# ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

ఢిల్లీ: అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "మనం శక్తిమంతంగా, గౌరవంగా ఉన్న ఈ సమయంలోనే యుద్ధానికి ముగింపు పలకడం ఉత్తమం" అని పెజెష్కియాన్ అన్నారు. ఈ పోరాటంలో ఇరాన్ విజయం సాధించిందని ప్రపంచం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించి అమెరికా పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు చేస్తోందని, అందుకే ప్రపంచవ్యాప్తంగా అమెరికా పట్ల ద్వేషం పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ ఏడాది ఆరంభంలో అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ప్రారంభమైన ఈ సంఘర్షణ, ప్రస్తుతం ప్రతిష్టంభనలో కొనసాగుతోంది. హార్ముజ్ జలసంధిలో ఇబ్బందులు, అమెరికా నౌకాదళ దిగ్బంధనం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు, వాషింగ్టన్ ఆర్థిక ఒత్తిడిని తీవ్రతరం చేస్తూ కొత్త ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. చర్చలకు మార్గం సుగమం చేసేందుకు ఒమన్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. జూన్‌లో అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందంలో ఇరాన్ లొంగిపోయినట్లు ఎలాంటి నిబంధనలు లేవని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు తలొగ్గేది లేదని, అవసరమైతే గట్టిగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. దేశంలో ఆర్థిక ఒత్తిళ్లు, అంతర్జాతీయంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో, శక్తిమంతమైన స్థితి నుంచే తాము శాంతి చర్చలకు సిద్ధమనే సంకేతాలు పంపేందుకే టెహ్రాన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# టారిఫ్‌లతోనే అమెరికా ధనిక దేశంగా మారింది



ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన టారిఫ్‌ల (సుంకాలు) విధానాన్ని బలంగా సమర్థించుకున్నారు. దిగుమతులపై విధించిన సుంకాల వల్లే అమెరికా అత్యంత ధనిక దేశంగా మారిందని, విదేశీ కంపెనీలు తమ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. సౌత్ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. "నాకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్. ఆ పదాన్ని నేను ప్రేమిస్తున్నాను. అది మనల్ని విపరీతంగా ధనవంతుల్ని చేసింది" అని వ్యాఖ్యానించారు. సుంకాల విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, అమెరికన్లకు ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయని ఆయన తెలిపారు. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు తాను ఒకటే చెబుతున్నానని ట్రంప్ అన్నారు. "అమెరికాకు కార్లను ఎగుమతి చేయాలంటే 25 శాతం సుంకం కట్టాలి. అది సాధ్యం కాదంటే, ఇక్కడికే వచ్చి మీ కార్ల ఫ్యాక్టరీలను నిర్మించుకోవాలి. ఇప్పుడు సౌత్ కరోలినాలో అదే జరుగుతోంది" అని ఆయన వివరించారు. ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ పెట్టుబడులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల అమెరికాలోకి సుమారు 19.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని ట్రంప్ తెలిపారు. దేశవ్యాప్తంగా వందల, వేల సంఖ్యలో ఫ్యాక్టరీలు నిర్మిస్తుండటంతో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు భారీగా పెరిగాయని అన్నారు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే తాను తెచ్చిన పన్ను, వాణిజ్య విధానాలు తలకిందులవుతాయని, పన్నులు పెరిగి, ఉద్యోగాలు పోతాయని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల నియంత్రణ కొనసాగేందుకు తమ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

# ఎవరినీ వదిలిపెట్టేది లేదు

హైదరాబాద్: ఎవరినీ వదిలిపెట్టేది లేదని.. అంజయ్యనగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలన్ని కూల్చేస్తామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడు అంతస్తుల భవనం కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. కూలిన భవనాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇక ఎవరిని ఉపేక్షించం. ఈ భవనాలన్నీ నాలాల పక్కన ఉన్నాయి. 50 గజాల్లోనే ఏడేసి అంతస్తులు కట్టారు. నిబంధనలు అతిక్రమించిన భవనాలన్నీ కూలుస్తాం. భవనాలు అన్ని నాలాను ఆనుకునే నిర్మించారు. బిల్డర్ సాజిద్ పరారీలో ఉన్నాడు. 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లకు ఇస్తున్నాడు" అని రంగనాథ్ తెలిపారు. ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతి చెందాడు. బిల్డింగ్ యజమాని అందుబాటులోకి రాలేదు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు ఇచ్చారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తులు బిల్డింగ్ నిర్మాణం జరుగుతుంది. నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. చుట్టుపక్కల ఉన్న భవనాలను కూడా పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తాం. హాస్టల్ బిల్డింగులు నిర్మించి రెంట్‌కు ఇస్తుంటాడు సాజిద్.. అతనిపై ఇప్పటికే చాలా ఫిర్యాదులు ఉన్నాయి" అని రంగనాథ్ పేర్కొన్నారు.

# 14 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు

అమరావతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, మార్గదర్శకాలను రూపొందించేందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 14 మంది సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం అమరావతి నుంచి ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి వంటి కీలక నేతలకు చోటు కల్పించారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సి.హెచ్. వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పాట్సమట్ల ధర్మరాజు సభ్యులుగా నియమితులయ్యారు. వీరితో పాటు ఎంఎస్ఎంఈ చైర్మన్ టి. శివశంకర్, చిలకం మధుసూదన్ రెడ్డి, కోటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కోరికాన రవికుమార్‌లను కమిటీలో సభ్యులుగా నియమించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాల ఖరారు వంటి కీలక బాధ్యతలను ఈ కమిటీ పర్యవేక్షించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త..

# 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ వచ్చేసింది!



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. మొత్తం 10,060 పోస్టుల భర్తీకి సంబంధించిన వార్షిక జాబ్ క్యాలెండర్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఈ మేరకు ఖాళీల భర్తీకి రాష్ట్ర ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఒకేసారి కాకుండా, ప్రణాళికాబద్ధంగా 4 దశల్లో భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉద్యోగార్థులు సన్నద్ధమయ్యేందుకు వీలుగా నోటిఫికేషన్ల షెడ్యూల్‌ను కూడా ముందుగానే ప్రకటించింది. దీని ప్రకారం, ఉన్నత విద్యాశాఖ పరిధిలో ఇప్పటికే 1,500 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. మిగిలిన పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్లను సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో విడుదల చేయనున్నారు. సెప్టెంబర్ 15న 3,231 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆ తర్వాత అక్టోబర్ 15న రెండు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 5,306 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో భాగంగా ఒక నోటిఫికేషన్‌లో 2,311 పోస్టులు, మరో నోటిఫికేషన్‌లో 2,995 పోస్టులు ఉంటాయి. దశలవారీగా నోటిఫికేషన్లు విడుదల చేసి, అక్టోబర్ మధ్య నాటికి మొత్తం 10,060 పోస్టుల నియామక ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్యాలెండర్‌కు అనుగుణంగా అభ్యర్థులు సన్నద్ధం కావాలని అధికారులు సూచిస్తున్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


## ఆగస్టు 24న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**ఉదయం 9.30 గంటల నుంచి ప్రజల నుంచి వినతుల స్వీకరణ**

**అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం**



కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్) : ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు సంబంధించిన వినతులను అధికారులకు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కోరారు.

### అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100కు ఫోన్ చేయండి

అర్జీదారులు సమర్పించిన దరఖాస్తు పరిష్కారం కాకపోయినా, తమ అర్జీ ఏ దశలో ఉందో తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ (సహాయ కేంద్రం) నంబర్ 1100కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. అలాగే అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను మీకోసం డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ విజ్ఞప్తి చేశారు.

## స్పెషల్ పార్టీ పోలీసులకు యూనిఫాం, షూస్ అందజేత

**రాబోయే ఎన్నికలు, వీవీఐపీ, వీఐపీ పర్యటనల నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు**

**అప్రమత్తంగా విధులు నిర్వహించాలి**

**- కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**



కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): రాబోయే ఎన్నికలు, వీవీఐపీ, వీఐపీ పర్యటనల నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ప్రత్యేక పోలీసు బృందాలుగా ఏర్పాటు చేసిన 30 మంది స్పెషల్ పార్టీ పోలీసులకు శనివారం ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ యూనిఫాం, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు, వీవీఐపీ, వీఐపీ పర్యటనల దృష్ట్యా ప్రత్యేక పోలీసు బృందాలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్పెషల్ పార్టీ పోలీసులను ఆదేశించారు. ప్రత్యేక పోలీసు బృందాలు తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విధుల్లో అప్రమత్తత, క్రమశిక్షణ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీ కృష్ణమోహన్, ఆర్ఐ శ్రీ నారాయణ, ఆర్ఎస్సై శ్రీ ప్రదీప్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.





## గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు విస్తృత తనిఖీలు

**అనుమానితులపై మత్తు పదార్థాల గుర్తింపు పరీక్షలు**

**రైల్వే స్టేషన్, సంకల్‌బాగ్, బస్టాండ్, ఎల్కూర్ బంగ్లా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు**



కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్)గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా సమక్షంలో కర్నూలు టూ టౌన్ సీఐ శ్రీధర్, కర్నూలు ఫోర్త్ టౌన్ సీఐ విక్రమసింహ తమ సిబ్బందితో కలిసి కర్నూలు రైల్వే స్టేషన్, సంకల్‌బాగ్, బస్టాండ్, ఎల్కూర్ బంగ్లా తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానిత యువకులను గుర్తించి, జిల్లా పోలీసు శాఖకు అందజేసిన మత్తు పదార్థాల గుర్తింపు పరీక్షా పరికరాల (డ్రగ్ డిటెక్షన్ కిట్స్) సహాయంతో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సేవించినట్లు అనుమానం ఉన్న వ్యక్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలపై పోలీసులు యువతకు అవగాహన కల్పించారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కర్నూలు పోలీసులు కోరారు. అలాగే అత్యవసర పోలీసు సేవల కోసం డయల్ 112, డయల్ 100కు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం కోసం ఈగల్ ఉచిత సహాయ నంబర్ 1972కు సమాచారం అందించాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కర్నూలు పోలీసులు విజ్ఞప్తి చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.



## ప్రభుత్వ ఆసుపత్రికి నాలుగు వీల్‌చైర్ల విరాళం

కుప్పం: ఆగస్టు 22 : కుప్పం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులకు మరింత సౌకర్యం కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ ముందుకు వచ్చింది. క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రికి రూ.25 వేల విలువైన నాలుగు వీల్‌చైర్లను విరాళంగా అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు అజిత్ ఆనంద్, సుబ్రహ్మణ్యం వీల్‌చైర్లను ఆసుపత్రి ప్రతినిధులకు అందజేశారు. వృద్ధులు,దివ్యాంగులు, అనారోగ్యంతో నడవలేని రోగులను ఆసుపత్రిలోని వివిధ విభాగాలకు తరలించేందుకు వీల్‌చైర్...

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి-2 ఫేజ్ శిక్షణ కార్యక్రమం నిర్వహణ

భీమవరం, ఆగస్టు 22 : భీమవరం అర్బన్, రూరల్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి శనివారం చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి--2 ఫేజ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాల్సిన ఆట ఆధారిత విద్య, తల్లిదండ్రుల భాగస్వామ్యం, పిల్లల అభివృద్ధి అంచనా, సమ్మిళిత విద్య వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణలో చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు అనుసరించాల్సిన బోధనా విధానాలు, పిల్లల అభ్యాస పురోగతిని అంచనా వేసే పద్ధతులు, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించే చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఈరోజు అబ్జర్వర్ గా సత్య శ్రీ పాల్గొని డిజబులిటీస్ కోసం వివరించారు, మరియు శిక్షణ తరగతులను పరిశీలించారు., డి ఆర్ పి లు సాయిరామ్ తదితరులు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. భీమవరం అర్బన్, రూరల్ ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధునాతన ట్రాఫిక్ అవగాహన వాహనం ప్రారంభం

**ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి**

**ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి**

**- రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి**

కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ప్రజలు, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై




అవగాహన పెంచేందుకు కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అధునాతన ట్రాఫిక్ అవగాహన వాహనాన్ని ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు.




ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు నగరంలో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మరింత అవగాహన కల్పించేందుకు డిజిటల్ తెరతో కూడిన అధునాతన అవగాహన వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ డిజిటల్ తెరపై ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించే వీడియోలను ప్రదర్శిస్తామని చెప్పారు. హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉల్లంఘించడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం తదితర కారణాలతో జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను కూడా ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ, ఆస్తి నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా ప్రోత్సహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. కర్నూలు నగరంలో ఒకే ప్రాంతానికి ఈ కార్యక్రమాన్ని పరిమితం చేయకుండా రద్దీ ప్రాంతాలను గుర్తించి, వివిధ ప్రదేశాల్లో, వివిధ సమయాల్లో ఈ అవగాహన వాహనం ద్వారా ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు కేవలం నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడమే కాకుండా, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ ధారణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, అతివేగంగా వాహనాలు నడపడం వంటి వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని నివారించేందుకు ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు నగరంలో అవసరమైన ప్రాంతాల్లో డివైడర్లు, వన్‌వేలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, సురక్షితంగా వాహనాలు నడపాలని ఎస్పీ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీ కృష్ణమోహన్, హోంగార్డ్స్ డీఎస్పీ శ్రీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీ మధుసూదన్ రావు, కర్నూలు ట్రాఫిక్ సీఐ శ్రీ మన్సురుద్దీన్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం, కర్నూలు.

## ఎమ్మెంఎస్-ఎంఎంఎం ఉమ్మడి కర్నూలు జిల్లా సమావేశం విజయవంతం

**మహిళా నాయకత్వంలో పెద్దఎత్తున సమావేశం - సామాజిక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపు**

కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): అభినవ అంబేద్కర్, మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన మాదిగ మహిళా సమైక్య (ఎంఎంఎస్), మహాజన మహిళా సమైక్య (ఎంఎస్‌పీ), మహాజన మహిళా మండలి (ఎంఎంఎం) జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా శనివారం కర్నూలు నగరంలో నిర్వహించిన





ఉమ్మడి కర్నూలు జిల్లా మహిళా కార్యకర్తల సమావేశం విజయవంతమైంది. కర్నూలు నగరంలోని ఆర్ఎస్ రోడ్డులో ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న బీఎస్ కళ్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మహిళా నాయకత్వంతో పాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎంఎంఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ శ్రీమతి చాట్లపల్లి విజయ్ మాదిగ, మహాజన మహిళా మండలి జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి జేపీ లతా మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి శ్రీమతి ఆలపాటి కరుణ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి తంబూరి తబితా మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి శ్రీమతి ఇనుగుర్తి మణెమ్మ, ఎంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి జగ్గుల స్వతంత్ర కుమారి మాదిగ, మహాజన మహిళా మండలి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి వాక జానకి మాల, జాతీయ అధికార ప్రతినిధి శ్రీమతి దాకూరి శిరీష దక్కలి, జాతీయ ఉపాధ్యక్షురాలు శ్రీమతి లక్ష్మీ మాల, ఎంఎంఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీమతి యద్దనపూడి జ్యోతి మాదిగ తదితర మహిళా నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా నాయకత్వం మాట్లాడుతూ మహిళా కార్యకర్తలు సామాజిక ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాలని, సంఘటితంగా పనిచేస్తూ సామాజిక హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా కమిటీ ఏర్పాటుకు, సమావేశం విజయవంతానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షుడు, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్. సుభాష్ చంద్ర మాదిగ, మాజీ కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డి పోగు విజయ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ దుమ్ము వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా కో-ఇన్‌చార్జ్ రెడ్డి పోగు భాస్కర్ మాదిగ తదితరులు సమావేశానికి సహకరించారు. అలాగే పోగు రవి మాదిగ, ప్రసాద్ మాదిగ, నాగేశ్వరమ్మ మాదిగ, శ్రీదేవి మాదిగ, చంద్రకళ మాదిగ, బతకమ్మ మాదిగ, నందిని మాదిగ తదితరులు పాల్గొని మహిళా కార్యకర్తల



సమావేశాన్ని విజయవంతం చేశారు. మహిళా నాయకత్వం, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ సామాజిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## డీఎస్సీకి ఎంపికైన హర్షిత, రాజులను అభినందించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

**కష్టపడి సాధించిన ఉద్యోగం మీ సొంతం -- ధైర్యంగా ఉండండి**

**పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి**

కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ పరిధిలో డీఎస్సీకి ఎంపికైన పోలకంటి హర్షిత, రాజు ఇళ్లకు వెళ్లి పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి వారిని అభినందించారు. ఈ





సందర్భంగా డీఎస్సీ అభ్యర్థి పోలకంటి హర్షిత మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన తాను రాత్రింబవళ్లు ఎంతో కష్టపడి చదివి ఉద్యోగాన్ని సాధించానని తెలిపారు. ఎంతో కష్టపడి సాధించిన తమ ఉద్యోగాలపై, నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీపై వైసీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం తమను ఎంతో బాధించిందని భావోద్వేగానికి గురయ్యారు. తాను కష్టపడి, నిజాయితీగా ఉద్యోగాన్ని సాధించానని, తమలాంటి నిరుద్యోగ యువత కష్టాన్ని ఎవరూ అవమానించకూడదని హర్షిత పేర్కొన్నారు. అదేవిధంగా కర్నూలు నగరంలోని 21వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రాజు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎంపికై, ఓర్వకల్లు మండలం కొమరరోలు మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజు మాట్లాడుతూ తాను మత్స్యకారుల కుటుంబానికి చెందినవాడినని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఎంతో కష్టపడి చదివి ఈ ఉద్యోగాన్ని సాధించానని తెలిపారు. స్టడీ సర్కిళ్ల ద్వారా అందించిన డీఎస్సీ కోచింగ్ తనకు ఎంతో ఉపయోగపడిందని, ఉద్యోగం సాధించడం పట్ల ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు ఎలాంటి అపోహలకు, భయాలకు గురికావాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మెగా



డీఎస్సీని అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని ఎమ్మెల్యే తెలిపారు. అభ్యర్థులు కష్టపడి సాధించిన విజయం వారికి సొంతమని, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువత కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని, వారి విజయాలు మరెందరో నిరుద్యోగ యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు.

## స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం



కుప్పం: ఆగస్టు 22 : కుప్పం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి నెల మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంలో భాగంగా కుప్పం పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కుప్పం పట్టణంలోని పంతొమ్మిదో వార్డు పరిధిలో రోడ్లు, వీధులు, మార్కెట్లు, బస్టాండ్, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. కాలువలు, చెత్తకుప్పలు, తదితర ప్రాంతాలను శుభ్రపరిచి నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి వాటిని పరిశుభ్రంగా మార్చడంతో పాటు ఇంటింటి నుంచి వంద శాతం చెత్త సేకరణ, తడి--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెల్వరాజు, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, కడ డైరెక్టర్ ఎస్. రాజ్ కుమార్, తదితర అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కోట్ల మంది సినీ అభిమానులకు పండుగ రోజు చిరంజీవి పుట్టినరోజు

**భీమవరం విజయలక్ష్మి థియేటర్ ప్రాంగణంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు**

భీమవరం : ఆగస్టు 22 ఇది కేవలం ఒక తేదీ కాదని, కోట్ల మంది సినీ అభిమానులకు పండుగ రోజు



అని, తెలుగు సినిమాను తన నటనతో, డ్యాన్స్‌తో దశాబ్దాల పాటు శాసించిన చిరంజీవి పుట్టిన రోజు అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో భీమవరం విజయలక్ష్మి థియేటర్ ప్రాంగణంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే అంజిబాబు కేక్ కట్ చేసి మాట్లాడారు. అద్భుతమైన నటన, కష్టపడే తత్వంతో ప్రేక్షకుల హృదయాల్లో మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ఎంతోమంది అభిమానులను సంపాదించుకోవడంతో పాటు తెలుగు సినిమా ఖ్యాతిని మరింతగా పెంచిన వ్యక్తి చిరంజీవి అని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఏఎంసి వైస్ చైర్మన్ బండి రమేష్ కుమార్, పత్తి హరివర్ధన్, వబిలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ చిరంజీవి కేవలం సినీ రంగానికే పరిమితం కాకుండా సమాజ సేవలోనూ తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. మెగా యూత్ ఫోర్స్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ వలవల ఫణి కుమార్, టౌన్ కన్వీనర్ బండి తరుణ్, అధ్యక్షులు యర్రంశెట్టి శ్రీనివాస్, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ చిరంజీవి రక్తనిధి, నేత్రనిధి వంటి సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేసి ఎంతోమందికి అండగా నిలిచారని, తద్వారా సమాజం పట్ల తన బాధ్యతను చాటుకున్నారని అన్నారు . కృష్ణకాంత్, యాతం స్వామి, కొప్పర్తి కోటి, దీపక్, పుప్పాల జనార్ధన్, తోట నికిత్, యార్లగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పించాలి – జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీల వెంకట శేషాద్రి

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులు, న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన



కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (ఎన్ఏఎల్ఎస్ఏ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్థి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీల వెంకట శేషాద్రి శనివారం కర్నూలు కలెక్టరేట్ సమీపంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజనం, వసతి, ఇతర మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్లను ఆదేశించారు. అనంతరం వసతి గృహాల్లోని నిల్వల రిజిస్టర్లు (స్టాక్ రిజిస్టర్లు), ఇతర రికార్డులను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహాల్లో పరిశుభ్రత, భద్రత, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



### బాలల హక్కులు, న్యాయ సేవలపై అవగాహన

తనిఖీల అనంతరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి స్పర్శ (గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్), బాలల రక్షణ, బాలల హక్కులు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (ఎన్ఏఎల్ఎస్ఏ) బాల–స్నేహపూర్వక న్యాయ సేవలు మరియు వారి రక్షణ పథకం--2024, వివిధ సంక్షేమ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



విద్యార్థులకు ఎలాంటి చట్టపరమైన సమస్యలు ఎదురైనా భయపడకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయ సేవల సహాయవాణి (లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్) 15100కు కాల్ చేస్తే వెంటనే అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీల వెంకట శేషాద్రి తెలిపారు. విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో అధికారులు, వసతి గృహాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు తమ హక్కులు, చట్టపరమైన రక్షణపై పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల వార్డెన్లు శైలజ, సులోచనతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# కర్నూలులో ఘనంగా ఉద్యోగ మేళా
# 750 మంది నిరుద్యోగ యువత హాజరు

## 101 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు – ప్రముఖ కంపెనీల ప్రతినిధుల పాల్గొనడం




కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నైపుణ్య అభివృద్ధి మరియు శిక్షణ శాఖ -- కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ ఉద్యోగ మేళాలో వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. మొత్తం 101 ఉద్యోగ ఖాళీల భర్తీకి అభ్యర్థుల ఎంపిక కోసం ఈ ఉద్యోగ మేళాను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 750 మంది నిరుద్యోగ యువత ఉద్యోగ మేళాకు హాజరయ్యారు. తమ విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవానికి అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందేందుకు అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ప్రస్తుతం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) శ్రీమతి సి. వెంకటనారాయణమ్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ (జీఎండీఐసీ) శ్రీ డి. సంజీవ రాజు, జిల్లా ఉపాధి అధికారి (డీఈఎస్ఓ) శ్రీమతి దీప్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) శ్రీ ఎల్. ఆనంద్ రాజ్ కుమార్ పర్యవేక్షించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థుల



విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అనుభవాన్ని పరిశీలిస్తూ ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు వారి ప్రతిభకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, యువతను నేరుగా ఉద్యోగ అవకాశాలతో అనుసంధానం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నైపుణ్య అభివృద్ధి మరియు శిక్షణ శాఖ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్) -- కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇటువంటి ఉద్యోగ మేళాల ద్వారా నిరుద్యోగ యువతకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, నేరుగా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి ఉద్యోగాలను పొందేందుకు మంచి అవకాశం లభిస్తోందని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో మరిన్ని ఉద్యోగ మేళాలను నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఉద్యోగ మేళా విజయవంతంగా కొనసాగుతున్నందుకు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి సి. వెంకటనారాయణమ్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీ డి. సంజీవ రాజు, నైపుణ్య అభివృద్ధి మరియు శిక్షణ శాఖ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, కార్యక్రమంలో పాల్గొన్న నిరుద్యోగ యువతకు అభినందనలు తెలిపారు.

# పి.జి.ఆర్.ఎస్.పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

## ప్రజలకు విజ్ఞప్తి చేసిన ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ నూరుల్ ఖమర్




కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.)పై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను రూపొందించిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ స్పందనను తెలియజేయాలని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ నూరుల్ ఖమర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) ద్వారా ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడంతో పాటు ప్రజల నుంచి నిరంతరం అభిప్రాయాలను సేకరించి, పౌరుల సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఇన్‌చార్జ్ కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పనితీరు, సమస్యల పరిష్కార విధానం, ప్రజలకు అందుతున్న సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున ప్రజలు క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి ప్రజా సమస్యల పరిష్కార వేదికపై తమ అభిప్రాయాలు, సూచనలు, స్పందనను తెలియజేయాలని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ నూరుల్ ఖమర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి అందే సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత సమర్థవంతంగా, ప్రజలకు ఉపయోగకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# గ్రామాల్లో పెచ్చుమీరుతున్న బెల్ట్ షాపులను రద్దు చేయాలి

## మహిళల భద్రత, కుటుంబాల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి




నంద్యాల జిల్లా/బనగానపల్లె, మహి న్యూస్, ఆగస్టు 22: గ్రామాల్లో పెచ్చుమీరుతున్న బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేసి, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య బనగానపల్లె మండల సమితి డిమాండ్ చేసింది. మహిళల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య నాయకులు ఎల్లేశ్వరమ్మ, స్వరూప మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, పేదలు, కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహిళల భద్రత, ఉపాధి, విద్య, వైద్యం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

### మహిళా సమాఖ్య ప్రధాన డిమాండ్లు

ప్రజలకు సంబంధించిన సంక్షేమ పథకాలను పారదర్శకంగా, న్యాయంగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందించాలని కోరారు. మహిళలు, పేదలు, నిరుపేద కుటుంబాల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు, కుటుంబాలను గుల్ల చేస్తున్న మద్యాన్ని సంపూర్ణంగా నియంత్రించాలని, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టి మహిళలు, కుటుంబాలను కాపాడాలని కోరారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను రద్దు చేసి మద్యం అందుబాటును తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లలందరికీ కేజీ నుంచి పీజీ వరకు పూర్తి ఉచిత, నాణ్యమైన విద్యను అందించాలని, పేద కుటుంబాల బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రతి మహిళకు ఉచిత వైద్యం, పౌష్టికాహారం, సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించాలని, మహిళలు, బాలికలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను కాలయాపన లేకుండా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణం, గృహ కార్మికులు, పారిశుధ్యం తదితర అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించాలని కోరారు. సముద్ర తీర ప్రాంతాల్లో మద్యం సంస్కృతి పెరిగేలా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని, మహిళల భద్రతకు భంగం కలిగించే 'బీచ్ షాక్' సంస్కృతిని ప్రోత్సహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, పేదల న్యాయమైన హక్కులకు సంబంధించిన డిమాండ్లపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి తక్షణమే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మహిళా సమాఖ్య నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నర్సమ్మ, అపర్ణ, కవిత, కాశమ్మ, చంద్రకళ, జ్యోష్ణ, మరియమ్మ, సుబ్బమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగు, తాగునీటి అవసరాలపై కీలక నిర్ణయాలు

## తుంగభద్ర దిగువ కాలువకు 670 క్యూసెక్కుల నీటి విడుదలకు ఇండెంట్.. హంద్రీ--నీవా నుంచి తాగునీటికి తక్షణ నీటి విడుదల గుండ్రేవుల రిజర్వాయర్‌ను హైపవర్ కమిటీ పరిధిలోకి తీసుకురావాలని తీర్మానం.. ఎల్ఎల్‌సీ నీటిని కర్ణాటకలో అక్రమంగా మళ్లించకుండా నిఘా పెట్టాలని సభ్యుల డిమాండ్




కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్) : 2026--27 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలను సమతుల్యంగా తీర్చేందుకు కర్నూలు జిల్లా నీటిపారుదల సలహా మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల తాగునీటి సమస్యలు, ఖరీఫ్ పంటలకు సాగునీటి సరఫరా, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్‌సీ), హంద్రీ--నీవా ప్రాజెక్టు, గాజులదిన్నె, ఆలూరు బ్రాంచ్ కాలువ, గుండ్రేవుల రిజర్వాయర్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. తుంగభద్ర జలాశయంలోని నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని, తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో ప్రస్తుతం ఉన్న తాగునీటి అవసరాలను ముందుగా తీర్చేందుకు 90 రోజుల పాటు నీటిని వినియోగించాలని సమావేశం నిర్ణయించింది. మిగిలిన నీటిని ఆరుతడి పంటలకు వారబందీ పద్ధతిలో అందించాలని తీర్మానించింది. ఇందుకోసం తక్షణమే 670 క్యూసెక్కుల నీటి విడుదలకు తుంగభద్ర బోర్డుకు ఇండెంట్ సమర్పించాలని నిర్ణయించారు కర్నూలు నగర పరిసర ప్రాంతాలు, కల్లూరు, కోడుమూరు మండలాల్లో నెలకొన్న తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హంద్రీ--నీవా సుజల స్రవంతి పథకం నుంచి హంద్రీ నదికి లద్దగిరి, కృష్ణగిరి స్లూయిస్‌ల ద్వారా చెరో 150 క్యూసెక్కుల నీటిని తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. అలాగే కర్నూలు నగరం, గాజులదిన్నె ప్రాజెక్టుపై ఆధారపడిన ప్రాంతాల తాగునీటి అవసరాల కోసం హంద్రీ--నీవా నుంచి గాజులదిన్నె జలాశయానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు. ఆలూరు బ్రాంచ్ కాలువ పరివాహక ప్రాంతంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో హంద్రీ--నీవా ప్రాజెక్టు నుంచి ఆలూరు బ్రాంచ్ కాలువకు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మరో తీర్మానం చేశారు. హంద్రీ--నీవా నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటి సరఫరా కోసం ఉద్దేశించిన స్లూయిస్ పరిమాణాన్ని పెంచాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు.







### గుండ్రేవుల రిజర్వాయర్‌కు ప్రాధాన్యం

తుంగభద్ర నదీ జలాల వినియోగం కోసం ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ అజెండాలో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణ అంశాన్ని చేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానం చేశారు. కర్నూలు జిల్లా ప్రజల చిరకాల కోరికగా ఉన్న గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని సభ్యులు స్పష్టం చేశారు.

### ఖరీఫ్ పంటలకు నీరు ఇవ్వాలి: ఎర్రబోతుల పాపిరెడ్డి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంలో పూర్తిస్థాయిలో నీరు ఉన్నందున ఖరీఫ్ పంటల సాగు కోసం నీటిని విడుదల చేయాలని కోరారు. ఎల్ఎల్‌సీ ద్వారా జిల్లాకు వచ్చే నీటిని కర్ణాటక ప్రాంతాల్లో కొందరు రైతులు అక్రమంగా మళ్లించకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

### ఎనిమిది గ్రామాల తాగునీటి సమస్య పరిష్కరించాలి: గౌరు చరిత

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కల్లూరు మండలంలోని హంద్రీ--నీవా పరివాహక ప్రాంతంలో సుమారు ఎనిమిది గ్రామాలు ఉన్నాయని, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆయా గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని తెలిపారు. ప్రజలతో పాటు పశువులకు కూడా తాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 3,000 క్యూసెక్కులకు పైగా నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో తమ ప్రాంతంలోని ఎనిమిది గ్రామాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి సుమారు 150 క్యూసెక్కులు, లద్దగిరి సమీపంలోని స్లూయిస్ నుంచి మరో 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. గ్రామాల్లోని బోర్లు పూర్తిగా ఎండిపోయాయని, హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని హంద్రీ నదిలోకి విడుదల చేస్తే తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కావడంతో పాటు భూగర్భ జలాలు రీఛార్జ్ అయి బోర్లలో నీటి లభ్యత పెరిగే అవకాశం ఉందన్నారు. కల్లూరు మండలంలోని ఉలిందకొండ చెరువుకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని కోరారు. అదే విధంగా హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి పరిసర గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం కర్నూలు జిల్లా ప్రజల చిరకాల కోరిక అని, ఈ ప్రాజెక్టును హైపవర్ కమిటీ పరిధిలోకి తీసుకువచ్చేలా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని ఎమ్మెల్యే కోరారు.








### జిల్లా సరిహద్దుకు చేరే నీరే ప్రామాణికం: విష్ణువర్ధన్ రెడ్డి

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న తీవ్రమైన నీటి ఎద్దడి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్యామ్‌ల నుంచి జిల్లాకు కేటాయించిన నీటి పరిమాణం కంటే జిల్లా సరిహద్దుకు వాస్తవంగా ఎంత నీరు చేరుతుందన్నదే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా కోడుమూరు నియోజకవర్గం, కల్లూరు మండలంలోని హంద్రీ నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎల్ఎల్‌సీ ద్వారా అందుబాటులోకి వచ్చే నీటిని సమర్థవంతంగా వినియోగించి తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కోరారు. పసుపుల, బి.తాండ్రపాడు గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, బి.తాండ్రపాడు చెరువులో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు వినియోగించి నీటి ఎద్దడిని తక్షణమే నివారించాలని ఇరిగేషన్ అధికారులను కోరారు.

### స్టాండింగ్ క్రాప్స్‌ను కాపాడాలి: టిప్పు సుల్తాన్

ఎల్ఎల్‌సీ చైర్మన్ టిప్పు సుల్తాన్ మాట్లాడుతూ ఎల్ఎల్‌సీ పరిధిలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు కొంతమేర నీటిని అందించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు రూపొందించి స్టాండింగ్ క్రాప్స్‌ను కాపాడేందుకు నీరు అందిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

### ఆలూరు బ్రాంచ్ కాలువకు నీరు విడుదల చేయాలి: వైకుంఠం జ్యోతి

ఆలూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగునీటి కోసం, ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాబోయే వేసవి వరకు తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. తుంగభద్ర డ్యామ్ నుంచి వచ్చే నీటిని కర్ణాటక ప్రాంతాల్లో కొందరు రైతులు అక్రమంగా వినియోగించకుండా అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. కాలువల్లో ఇసుక బస్తాలు వేసి నీటిని మళ్లించే చర్యలను అడ్డుకోవాలని సూచించారు. చిప్పగిరి మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, గత పదేళ్లుగా హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా ఆలూరు బ్రాంచ్ కాలువకు నీరు అందడం లేదని తెలిపారు. ప్రస్తుతం ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా ఆలూరు బ్రాంచ్ కాలువకు నీటిని విడుదల చేసి చిప్పగిరి మండలాన్ని ఆదుకోవాలని కోరారు. చివరి ఆయకట్టు ప్రాంతాల రైతులకు కూడా నీరు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

### నీటి కేటాయింపులపై అధికారుల వివరణ

జలవనరుల శాఖ ఎస్ఈ శైలేశ్వర్ నీటి కేటాయింపులు, విడుదల, అందుబాటులో ఉన్న నీటి వనరులు తదితర అంశాలను సమావేశ సభ్యులకు వివరించారు. సమావేశంలో హంద్రీ--నీవా ఎస్ఈ రాజన్ బాబు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు వెంకట శివప్రసాద్, రమాకాంత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, హుసేన్ సాహెబ్, ధర్మారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయరాజు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, సీపీఓ భారతి, హార్టికల్చర్ అధికారి రాజా కృష్ణారెడ్డి, ఇరిగేషన్ శాఖ డీఈలు, నీటిపారుదల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న తీర్మానాల అమలుతో జిల్లాలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు ఖరీఫ్ పంటలను కాపాడేందుకు అవసరమైన నీటి సరఫరా జరిగే అవకాశం ఉంది.

# 'సాసా'తో స్వచ్ఛతకు సరికొత్త రూపు

## కేసీ కెనాల్‌లో యుద్ధప్రాతిపదికన గుర్రపుడెక్క తొలగింపు

## నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు, ఆగస్టు 22: (మహి న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర (సాసా) కార్యక్రమం ద్వారా నగర స్వచ్ఛతకు సరికొత్త రూపు సంతరించుకుంటోందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జోహరాపురం కేసీ కెనాల్ బండ్ (పాకెట్ పార్క్) వద్ద మొక్కలు నాటారు. అనంతరం కేసీ కెనాల్‌లో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించే పనులను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఒక్కో అంశాన్ని ఎంచుకుని స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తుండటంతో నగరంలో సమూలమైన మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ నెల మూడో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉన్నందున



నాలుగో శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసీ కెనాల్‌లో దట్టంగా పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించేందుకు హిటాచీ యంత్రానికి ప్రత్యేకంగా రింగ్‌ను తయారు చేయించి, 10 ట్రాక్టర్లను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన తొలగింపు పనులను ప్రారంభించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. కేసీ కెనాల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగరపాలక సంస్థ తరఫున నిరంతరం చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ ఇంజనీర్ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి



డాక్టర్ ఎం. రఘు, సహాయ ఇంజనీర్ మనోహర్ రెడ్డి, ఉప కార్యనిర్వహణ ఇంజనీర్ పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, పారిశుధ్య పర్యవేక్షకుడు రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు శివశంకర్, హుస్సేన్, సాంకేతిక సహాయకుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com